
# పచ్చని ఆకులు - ఎఱ్ఱని మచ్చలు



'మయూరి' వార పత్రిక . . . 24 నవంబర్, 1995

మార్గశిర మాసపు రాత్రి... బహుళ దశమి!

క్షయచంద్రుడు వెలవెలబోతూ లోకంలోని చీకటిని పారద్రోలడానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నాడు. పెళ్ళి పందిట్లో మంగళవాద్యాలు మ్రోగుతున్నాయి. మధ్యమధ్య పురోహితుల మంత్రాలు వినిపిస్తున్నాయి. పెళ్ళిసందడితో ఆ నిశీధిలోని నిశ్శబ్దం భగ్నమవుతోంది.

మంగళవాద్యాల జోరు హెచ్చింది.

"మాంగల్యం తంతునా నేనా మమజీవన హేతునా..." అంటూ పురోహితులు వల్లిస్తున్న మంత్రాలు ఉచ్చస్వరంతో వినిపించసాగాయి. కుమార్ పుస్తెని చేతిలో పుచ్చుకుని ముందుకి వంగాడు. పెండ్లికుమార్తె పినతల్లి పెళ్ళికూతురి జడను పైకెత్తి పట్టుకుంది.

పుస్తెను పుచ్చుకున్న రెండుచేతులు మాధవి మెడ దగ్గరికి వచ్చాయి.

అప్రయత్నంగా తలెత్తి చూసింది మాధవి. ఆమె గుండె ఝల్లుమంది... తల తిరిగిపోయింది. కళ్ళముందున్న భూమి తిరిగినట్లనిపించింది.

కళ్ళముందు కదలాడుతున్న మంగళసూత్రం తన మెడకు బిగించబోతున్న ఉరిత్రాడులా అనిపించింది. ఆ చేతులు తనని కాటేయబోతున్న కాలసర్పాల్లా కన్పించాయి. ఆమె కంటికి కుమార్ మచ్చలోన పాశంతో వచ్చిన కాలయముడిలాగా అనిపించాడు.

ఆవేదనతో, ఆక్రోశంతో, అవమానంతో మాధవి తల బరువెక్కిపోయింది. ఆ బరువుకి తట్టుకోలేక తల వంగిపోయింది. జడలో ఒత్తుగా పెట్టిన చేమంతి పూలచెండు తన బరువుతో వాలిన తలను నిలబెట్టాలని చూసింది కాని, ఫలితం లేకపోయింది. వాలిన తలక్రింద కారిన కన్నీరు ఎవరి కంటా పడలేదు.

బాధతో హృదయం బరువెక్కిపోయింది. ఆ భారానికి హృదయమే కాదు- దేహం కూడా శకలావికలాలై పోయేటట్టు ఉంది. దుఃఖం మానసిక ఒత్తిడికి తట్టుకోలేక గడ్డకట్టేసి బయల్పడలేక మూగబోయింది. భయంతో, బాధతో గట్టిగా కళ్ళు మూసుకుంది మాధవి.

కళ్ళు మూసుకున్నా ఆ దృశ్యమే కళ్ళముందు మెదులుతోంది. కుమార్ ముఖం మీద, గుండెల మీద ఎఱ్ఱగా, భయంకరంగా ఉన్న బొల్లి తనని చూసి వికృతంగా నవ్వుతున్నట్లున్నాయి.

తృటిలో జరిగిన ఈ సంఘటన మాధవి మనసుకి గంటల తరబడిగా ఉన్నట్లనిపించింది. కాలగమనమే ఆగిపోయినట్టుగా అనిపించింది... ఆ అమాయక హృదయానికి.

మెడలో పుస్తెల తాడు బిగుస్తుండగా తిరిగి ఈ లోకంలోకి వచ్చింది మాధవి.

ఒక అధ్యాయం మొదలయింది. వెలుగు పోయింది. చీకటి వచ్చింది. తిరిగి వెలుగురాని చీకటి! శాశ్వతమైన చీకటి- అనంతమైన చీకటి- ఆకాశాన్ని మించిన చీకటి- కాటుక కన్న నల్లని కటిక చీకటి- కారు చీకటి!

వివాహ తతంగం యాంత్రికంగా జరిగిపోతోంది. వధూవరులు ముడివేసిన చెంగులతో అగ్ని చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు. మండుతున్న అగ్ని వంక చూసింది మాధవి. తనలో వేసిన సర్వస్వాన్నీ దహించివేస్తూ ప్రజ్వరిల్లుతోంది ఆ అగ్ని.

ఆ అగ్ని తన మనస్సులో ప్రజ్వరిల్లుతున్న దావాగ్ని ముందు ఆరిపోతుంది. అది ఆరకపోయినా వివాహతంతు అయిపోగానే ఆర్పివేస్తారు. కాని, తన హృదయంలో రగులుతున్న అగ్ని ఆరేది కాదు, ఆర్పేది కాదు. ఆర్పడం ఎవరికీ సాధ్యం కూడా కాదు. అగ్ని చుట్టూ భర్తతో ప్రదక్షిణం చేస్తున్న మాధవికి కన్నీళ్లు తిరిగాయి. ఎదురుగా ఉన్న అగ్నిహోత్రుడికి ఆ కన్నీటిని ఇగిరింపగల శక్తి లేకపోయింది. తన అశక్తతను అవమానంతో కుమిలిపోతూ అల్లాల్లాడిపోయాడు. హృదయాన్ని నింపివేసిన విచారం గడ్డ కట్టి, కన్నీటి ప్రవాహానికి అడ్డుకట్టను వేసింది. కుసుమ కోమలమైన మాధవి హృదయం శిలయైపోయింది.

●

మాధవి శోభనపు గదిలో మంచంమీద కూర్చునివుంది.

మేడ మీదనున్న ఆ గదిలోకి చల్లని పిల్లవాయువులు వచ్చి ఆమె మేనుని మృదువుగా స్పృశిస్తున్నాయి. కాని, ఆమెలో రగులుతున్న దావాగ్నిని అవి చల్లార్చలేకపోయాయి.

గది ఎంతో అందంగా అలంకరించబడివుంది. మాధవిని ఇంకెంతో అందంగా అలంకరించారు. అసలే అందమైన ఆమె సోయగం, అలంకరణతో మరింత అందాన్ని సంతరించుకుంది. ఎదురుగావున్న నిలువుటద్దంలో కనిపిస్తున్న ఆమె ప్రతిరూపం ఆమెని వెక్కిరిస్తోంది. ఎవరికోసం ఈ అందం? ఎవరికోసం ఈ అలంకరణ! తన ప్రతిబింబాన్ని తానే చూడలేక కిటికీ వద్దకు పోయి నుంచుంది.

ఆకాశంలో చంద్రుడు పిండి వెన్నెలలు కురిపిస్తున్నాడు. ఆ వెన్నెల కాంతి, దూరాన వున్న కొండలపై పడి ప్రతిఫలిస్తోంది. 'అడవిగాచిన వెన్నెల ఎవరికోసం?' అనుకుని నిట్టూర్చింది మాధవి.

నిర్మలంగా ఉన్న ఆకాశంలో నీలిమబ్బులు వస్తున్నాయి. అమాయకంగా నిర్మలమైన వెన్నెలను కురిపిస్తున్న చందమామని మబ్బులు మూసివేయసాగాయి.

కాసేపటికి మబ్బుల్ని తప్పించుకొని తిరిగి చంద్రుడు బయటకు వచ్చాడు. తెల్లని చంద్రునికి నల్లని మచ్చలు ఎంతో అందాన్ని కల్పిస్తున్నాయి. 'ఆ మచ్చలు లేకుండావుంటే చందమామకి అంతటి అందం ఉండేదా?' అనిపించింది మాధవికి. వెంటనే కుమార్ వికృతరూపం మనోనేత్రాల ముందు భయంకరంగా ప్రత్యక్షమయింది. ఆ ముఖంలోని వికారమైన బొల్లిమచ్చలు తనవంకే చూస్తూ వికటాట్టహాసం చేయసాగాయి. భయంతో, అసహ్యంతో కళ్ళు మూసుకుంది మాధవి.

'పరమేశ్వరా... ఈ దృశ్యం భరించలేను!' అనుకుంది.

దూరాన్నుంచి చంద్రుడు ఎంత అందంగా ఉన్నాడు?! దగ్గరనుంచి చూస్తే చందమామ కూడా అసహ్యంగానే ఉంటాడేమో! తన భర్త చేరువలో ఉన్నాడు కనుకనే అంత వికృతంగా అనిపిస్తున్నాడు కాబోలు! 'దూరపుకొండలు నునుపు' అన్న సామెత ఊరికే లేదు. భారంగా నిట్టూర్చింది మాధవి. పల్చని నీలిమేఘాలు నెమ్మదిగా వస్తూ చందమామ ముఖాన్ని స్పృశించసాగాయి. చల్లనిగాలి మాధవి ముఖాన్ని పరామర్శిస్తోంది.

వెనుకనుంచి భుజంమీద కలిగిన చల్లని స్పర్శతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగిచూసింది మాధవి. చిరునవ్వుతో తనవంకే చూస్తున్న కుమార్ ముఖం ఆమెకి భయంకరంగా కనిపించింది. అప్రయత్నంగా కెవ్వున కేకవేసి పెనుగాలిలో లేత తమలపాకులాగా వణికిపోసాగింది.

"ఎందుకు భయం... నేనే!" అంటూ మాధవిని చేతుల్లోకి తీసుకున్నాడు కుమార్.

అతని స్పర్శని భరించలేకపోయింది మాధవి. అతని బాహుపంజరంలో కొత్తగా పెట్టిన పక్షి వలె కొట్టుకోసాగింది. అతని రూపం కళ్ళముందు కనిపిస్తుంటే, అతని స్పర్శను అనుభవిస్తుంటే ఆమెకి కంపరం కలిగింది.

కుమార్ ఆమెను తన గాఢపరిష్వంగంలోనికి తీసుకుంటున్నాడు. తీవ్రమైన మానసిక సంఘర్షణలో నలిగిపోతున్న ఆమె ఇంకెంతమాత్రం భరించలేకపోయింది. చేసేదేమీ లేక అచేతనంగా సోలిపోయింది.

అకస్మికంగా జరిగిన ఈ సంఘటనకి బిత్తరపోయాడు కుమార్. వెంటనే ఆమెను ఎత్తుకుని తీసుకువచ్చి మంచంమీద పడుకోబెట్టి ఫోన్ చేశాడు.

కొంచెంసేపటికి తెప్పరిల్లింది మాధవి. నీరసంగా అతనివంక చూసింది. ఆందోళనతో ఆమెవంకే చూస్తున్న కుమార్‌కి ఆ నీరసపు చూపుల వెనక దాగివున్న నిరాశానిస్పృహలు కనిపించలేదు.

"ఎలావుంది? అసలు ఏమయింది?" ఆందోళనగా ప్రశ్నించాడు.

"ఏం లేదు. కొంచెం ఒళ్ళు బాగాలేదు... అంతే!" అంది.

"ఏం..? జ్వరం వచ్చిందా?" అంటూ చేయి పట్టుకున్నాడు కుమార్.

అతని స్పర్శతో తిరిగి వణికిపోసాగింది.

"చలి వేస్తున్నట్టుంది..." అంటూ దుప్పటి కప్పి ఫ్యాన్ ఆఫ్‌చేసి వచ్చాడు కుమార్.

"డాక్టరుకి ఫోన్ చేస్తాను..." అంటూ లేచాడు.

"వద్దు... వద్దు... కంగారుపడవలసిందేమీ లేదు. అదే సర్దుకుంటుంది!" అంది మాధవి కంగారుగా.

"సరే... విశ్రాంతిగా పడుకో!" అంటూ వేరే మంచంమీద నడుం వాల్చాడు కుమార్.

ఎవరి ఆందోళనలో వారు ఆ రాత్రిని కలత నిద్రలో గడిపేశారు.

●

మరికొన్ని రోజులు గడిచాయి.

ప్రతిరోజూ ఏదో ఒక సాకుతో మాధవి తనని తప్పించుకు తిరుగుతుండడం, ఎప్పుడూ దిగులుగా ఉండడం గమనిస్తూనే ఉన్నాడు కుమార్. అతని సహనం అంతకంతకూ నశిస్తోంది. కాని, 'తను ఏ మాటంటే ఆమె ఏ విధంగా నొచ్చుకుంటుందో..' అన్న భయంతో అతను కూడా సాధ్యమైనంత ముభావంగా ఉంటూ వచ్చాడు.

ఆరోజు మాధవి బాల్కనీలో పడుకునివుంది. మరికొంచెం దూరంలో వేరే మంచం మీద పడుకొనివున్నాడు కుమార్. ఓ రాత్రివేళ దాహం వేస్తే మంచినీళ్ళు త్రాగాలని లేచాడు.

పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. స్విచ్ వేసి మంచినీళ్ళు త్రాగి, స్విచ్ ఆర్పబోతూ మాధవి వంక చూశాడు.

మాధవి గాఢనిద్రలో మునిగివుంది. ఆ విద్యుత్ కాంతిలో ఆమె అలంకరించిన అపరంజి బొమ్మవలె మెరిసిపోతోంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీస్తుంటే ఆమె శరీరంలోని వంపుసొంపులు దేహసౌష్టవాన్ని అధికతరం చేస్తున్నాయి. ఆమె సౌందర్యం, పరిసర ప్రకృతి ఉద్రేకాన్ని రెచ్చగొట్టేవిగా ఉన్నాయి.

ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు కుమార్. నెమ్మదిగా వెళ్లి ఆమె ప్రక్కనే పడుకొన్నాడు. ఆమె మీద చేయి వేసి, నెమ్మదిగా తనవైపు తిప్పుకోబోయాడు.

కంగారుగా లేచింది మాధవి.

"భయపడకు... నేనే!" అన్నాడు కుమార్ నెమ్మదిగా.

మాధవి మనసులో నిత్యమూ సంఘర్షణ చెలరేగుతూనే ఉంది. భార్యగా తాను భర్తపట్ల తన విద్యుక్తధర్మాన్ని నెరవేర్చలేకపోతోంది ఆయనంటే తనకి గౌరవం ఉంది, భక్తి ఉంది... కాని, ప్రేమించలేకపోతోంది. ఆయన రూపాన్ని అసహ్యించుకోకుండా ఉండలేకపోతోంది. ఆయన రూపం పరమ వికారమైనదే కావచ్చు. కాని, మనసు మాత్రం స్వచ్ఛమైనది. ఎంతటి ఉత్తముడు కాకుంటే తన వాంఛలను చంపుకొని దూరంగా ఉంటాడు? కేవలం తనకోసం! అటువంటి ఉత్తమునికి ద్రోహం చేస్తున్నందుకు బాధపడ్తూనే ఉంది. కాని, మనసుతో రాజీపడలేక సతమతమవుతోంది మాధవి.

ఆ క్షణంలో... ఉద్రేకంతో దీనంగా తనవంకే ఆశగా చూస్తున్న కుమార్‌ని చూస్తుంటే జాలివేసింది మాధవికి. తన మనసుని సమాధానపరచుకుని కీలుబొమ్మ వలె అతనికి లొంగిపోవాలని నిశ్చయించుకుంది. భార్యగా అది తన కనీసధర్మమని భావించింది. తనవైపు నుంచి ప్రతిఘటన లేకుండా అలానే ఉండిపోయింది.

మాధవిలో మార్పు గమనించిన కుమార్ నెమ్మదినెమ్మదిగా ఆమె సరసన చేరాడు. ఆమె నడుంచుట్టూ చేతులు పోనిచ్చి, ఆమెను తన గాఢపరిష్వంగంలోకి తీసుకున్నాడు.

మాధవి వంటిమీద దూలగొండి ఆకులు పడినట్లుగా బాధపడసాగింది. కాని, ఎంతో ఓర్పుతో యాంత్రికంగా అతనికి లొంగిపోసాగింది.

కుమార్ పట్టరాని ఉత్సాహంతో ఆమె ముఖాన్ని తన చేతులలోకి తీసుకున్నాడు. పట్టరాని తమకంతో ఆమెను చుంబించాడు. ఎప్పుడైతే కుమార్ బొల్లిపెదవులు మాధవి అధరాలను తాకాయో ఇక తట్టుకోలేకపోయింది ఆమె. వెల్లువ వలె బొళుక్కున వాంతి వచ్చేసింది. ఆ హఠాత్పరిణామానికి నివ్వెరపోయి ఆమెని వదిలేశాడు కుమార్.

అపరాధం చేసినదాని వలె తల దించుకుంది మాధవి. కొంచెంసేపు మౌనంగా ఉండి, దెబ్బతిన్న హృదయంతో అక్కడి నుండి వెళ్లిపోయాడు కుమార్.

●

మర్నాడు సాయంత్రం క్రోటన్ మొక్కలకు నీళ్లు పోస్తోంది మాధవి. ఏపుగా ఎదిగిన క్రోటన్ మొక్కలు ఆకుపచ్చని ఆకుల మీద ఎఱ్ఱని మచ్చలతో ఎంతో అందంగా ఉన్నాయి.

"ఏం చేస్తున్నావు మాధవీ?" అంటూ వచ్చాడు కుమార్.

"క్రోటన్ మొక్కలకు నీళ్లు పోస్తున్నాను..." అంది మాధవి తల దించుకుని. రాత్రి జరిగిన సంఘటనకు ఆమె చాలా సిగ్గుపడుతోంది.

"అవి ఎంత అదృష్టం చేసుకున్నాయి?" అన్నాడు కుమార్.

ప్రశ్నార్థకంగా చూసింది మాధవి.

"అవును... నీ పోషణలో అవి ఏపుగా ఎదుగుతున్నాయి!" అన్నాడు కుమార్.

మాధవికి అతని భావం అర్థమయింది. కానీ, ఏమీ మాట్లాడలేదు.

"ఒక్క విషయం అడగనా మాధవీ!" అన్నాడు కుమార్.

మాధవి గుండె దడదడ కొట్టుకుంది... "అడగండి!" అంది నిర్లిప్తంగా.

"నేను బొల్లివాడిననే కదూ... నీకు నేనంటే అసహ్యం!" అన్నాడు దీనంగా.

ఏమీ మాట్లాడలేదు మాధవి.

"సమాధానం చెప్పు మాధవీ!" అన్నాడు కుమార్ మరింత దీనంగా.

"చెప్పి ప్రయోజనం ఏమిటి చెప్పండి... అనవసరంగా బాధపడడమేగా!" అంది.

"ప్రయోజనం సంగతి తర్వాత! నిజం చెప్పు... నా బొల్లిరూపాన్ని నువ్వు భరించలేకపోతున్నావు కదూ?!" అన్నాడు కుమార్.

"నిజమే... నేను అసహాయురాలిని!" అంది మాధవి నెమ్మదిగా.

భారంగా నిట్టూర్చాడు కుమార్- "మరి, నా పొత్తుని సహించలేనిదానివి నన్ను వివాహమాడడానికి ఎందుకు ఒప్పుకున్నావు మాధవీ? నా బొల్లి సంగతి తెలిసికూడా నన్ను చూడనైనా చూడకుండా ఎందుకు ఒప్పుకున్నావు?"

"పేదవాడైన నా తండ్రికి నా బరువు తీరే అవకాశం వచ్చింది అందుకు సమ్మతించడం కుమార్తెగా నా ధర్మం అనుకున్నాను. వివాహం చేసుకుని పుట్టింటి నుంచి వెళ్లిపోవడమే నా లక్ష్యం! కాని, ఎవరిని వివాహ మాడుతున్నానన్న ఆలోచన నాకు లేదు. అవసరమూ అనిపించలేదు. మీకు తీవ్రమైన బొల్లి ఉందని నాకు తెలుసు. మిమ్మల్ని చూస్తే నేను స్థైర్యం కోల్పోయి, పెళ్ళికి ఒప్పుకోకపోతానేమోనన్న భయంతో చూడకుండానే మిమ్మల్ని పెళ్ళాడడానికి ఒప్పుకున్నాను!" అంది మాధవి.

"అంత ఉదారంగా నీ సౌఖ్యాన్ని త్యాగం చేసినదానివి- మరి, నాతో సరిపడలేవా? భార్యగా అది నీ ధర్మం కాదా?"

"అక్కడే నేను పొరపాటు పడ్డాను. నన్ను నేను తప్పుగా అంచనా వేసుకున్నాను. నా మనస్సు నా చెప్పుచేతల్లో ఉంటుందనుకున్నాను. కాని, అది ఎదురు తిరగవచ్చని ఊహించలేకపోయాను. నా మనసుని సమాధాన పరచుకోవాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా సఫలీకృతురాలిని కాలేకపోతున్నాను..."

- ఆ మాటలు అంటుంటే ఆమె గొంతు జీరబోయి కన్నీళ్లు తిరిగాయి.

"ఒక్కమాట చెప్పు... నువ్వు ప్రేమతో పెంచుకున్న క్రోటన్ మొక్కలకు కూడా ఎఱ్ఱని మచ్చలు ఉన్నాయి. ఆ మచ్చలు ఉండడం వల్లే వాటికి అందం, ప్రత్యేకత ఏర్పడ్డాయి. నువ్వు ప్రేమతో పెంచుతున్న ఆ క్రోటను మొక్కల పాటి నేను చేయనా? అంత మాత్రం నన్ను ప్రేమించలేవా?" ఎంతో ఆవేదనగా అడిగాడు కుమార్. మాట్లాడుతుంటే అతని గొంతు గాద్గదికమయింది.

నిర్లిప్తంగా చిరునవ్వు నవ్వింది మాధవి.

"నాకూ, మీకూ ఉన్న సంబంధం క్రోటను మొక్కకూ, నాకూ మధ్య ఉన్నట్టిదే అయితే నెత్తిన పెట్టుకుని ఆరాధించేదానిని. కాని, దురదృష్టవశాత్తూ నేను మనసున్న మనిషినయిపోయాను. నేను మోడునయినా, లేదా మీరు మొక్కయినా ఈ బాధ ఉండేది కాదు. మీరంటే నాకెంతో గౌరవం ఉంది. మీరు ఎంతో ఉన్నతమైన దైవసమునిగా నా మనసులో ఆరాధిస్తున్నాను. కాని, భౌతికంగా మాత్రం నా మనసుని నా ఆధీనంలో ఉంచుకోలేక పోతున్నాను. ఆదర్శానికీ, ఆచరణకీ మధ్య ఇంతటి అగాధం ఉంటుందని ఊహించగలిగి వుంటే ఇంతటి పొరపాటు చేసి ఉండేదాన్ని కాదు" అంది.

"నిజం మాధవీ! నా డబ్బుతో నిన్ను కొనగలననుకున్నాను కానీ, నీ మనసును కొనగలనా? డబ్బుతో ఏదైనా సాధించవచ్చని నేను పొరపాటు పడ్డాను. నిష్కారణంగా నీ మనసుతో చెలగాటాలాడుతూ నిన్ను మానసికంగా హింసిస్తున్నాను. నన్ను మన్నించు మాధవీ!" అన్నాడు కుమార్ బాధగా.

"మీరు అనవసరంగా బాధపడుతున్నారు. తెలిసి తప్పు చేసింది నేను! మిమ్మల్ని మాత్రమే క్రోటన్ మొక్కలతో ఎందుకు పోల్చుకుంటారు? ఎంత అందం ఉన్నా క్రోటన్ మొక్కకి సార్ధకత లేదు. ఎందుకంటే అది ఫలించదు. అలాగే అన్నీవున్న నేను కూడా మనసుని మార్చుకోలేక పోవడంతో సార్ధకత లేని జీవితాన్ని గడుపుతున్నాను. రేఖలయితే మన చేతిలో ఉన్నాయి కాని, జాతకాలు మన చేతిలో లేవు. మీరు అనవసరంగా బాధపడకండి. ఎలా జరగాల్సివుంటే అలానే జరుగుతుంది!" అంది మాధవి వేదాంతిలాగా.

"వీల్లేదు మాధవీ... అలా జరగడానికి వీల్లేదు. నాది ఎలాగూ మోడువారిన జీవితమే! ఇది చిగురించే అవకాశం ఎలానూ లేదు. కాని, నా కారణంగా పచ్చగా ఉండాల్సిన నీ జీవితం మోడువారిపోడానికి వీలులేదు. మనం విడాకులు తీసుకుందాం. ఎంత డబ్బైనా ఖర్చు పెట్టి నీకు నేను సంతోషంగా మరో సంబంధం చూసి పెళ్ళి చేస్తాను. నేను చేసిన తప్పును దిద్దుకుంటాను!" అన్నాడు కుమార్ ఆవేశంగా.

"భలే చిత్రమైనవారు మీరు! డబ్బుతో మనస్సును కొనలేమని గ్రహించిన మీరు తిరిగి డబ్బుతో మరో మనిషిని కొని, నాకు ఇస్తానంటే నవ్వొస్తోంది. మనసున్న మనిషైతే మీ డబ్బుతో అవసరం ఏముంటుంది?" అంది మాధవి నవ్వుతూ.

కుమార్ ఏమీ మాట్లాడలేకపోయాడు. బుఱ్ఱ గోక్కుంటూ...

"మరి, నన్నేం చేయమంటావో నువ్వే చెప్పు?" అన్నాడు.

"నేను మీతో సంసారం చేయలేకపోయినా మీవంటి సహృదయుల ఆసరాను పోగొట్టుకోలేను. మిమ్మల్ని విడిచి మరొకరిని వివాహమాడి కన్నవారినీ, కట్టుకున్నవారినీ అపహాస్యం పాలు చేయలేను. మీతో భార్యగా గడపాలని ఎంతో ప్రయత్నిస్తున్నాను. చిత్తశుద్ధితో చేస్తున్న నా ప్రయత్నంలో ఏనాటికైనా విజయం పొందుతాననే నమ్మకం నాకుంది. విజయం పొందగలిగితే అంతకుమించిన సంతోషకరమైన విషయం మరొకటి ఉండదు. లేకుంటే ప్రయత్న లోపం లేదనే తృప్తితో కన్ను మూస్తాను. భక్తులలో చాలామంది దైవసాన్నిధ్యం చెందగలరే కాని, దైవైక్యం పొందగలిగేవారు బహు కొద్దిమంది. అలాగే నేను కూడా నా దైవమైన మిమ్మల్ని ఆరాధిస్తూ మీ పంచనే గడుపుతాను. అదృష్టం ఉంటే మీలో ఐక్యం అవుతాను" అంది మాధవి.

"నీది ఎంతటి అమృత హృదయం మాధవీ! ఇన్నాళ్లూ దగ్గర ఉండికూడా నీవంటి సౌందర్యవతిని అనుభవించలేక పోయినందుకు బాధపడ్డాను. ఇప్పుడు నీవంటి ఉన్నతురాలి సాన్నిహిత్య భాగ్యం కలిగినందుకు గర్విస్తున్నాను. నీ ప్రయత్నంలో భగవంతుడు నీకు విజయం ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను. అందుకు నావంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. నీ ప్రయత్నంలో విజయం పొందిననాడు నా అంతటి అదృష్టవంతుడు మరొకడు ఉండడు!" అన్నాడు కుమార్ ఆవేశంగా.

"చాలా సంతోషం! మనం ఒకరినొకరు అర్థంచేసుకుని ప్రవర్తించగలిగితే ఆ విజయం అచిరకాలంలోనే సిద్ధిస్తుందన్న నమ్మకం నాకుంది!" అంది మాధవి తృప్తిగా నవ్వుతూ.

ఎఱ్ఱ మచ్చల క్రోటన్లు గాలికి తలలూపుతూ వారి నిర్ణయానికి హర్షం వెలిబుచ్చాయి.

*'మయూరి' వార పత్రిక . . . **24 నవంబర్, 1995***